నేటి కందం- నేటికి అందం

భారత దేశమున సమా
చారము నభివృద్ధి పరుప చక్కని గతిలో
ధీరాళి శాటిలైటును
నేరుగ పంపించినారు నిజముల నరయన్ !!
(5-1-2014 GAST14
శాటిలైట్ ప్రయోగం)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

చురక

రైతుభరోసా పైనా
రాజకీయ ధుమారం
ధరఖాస్తులు ఎందుకో
దారితప్పే ఎవ్వారం
సమాచారమంతా నేడు
సర్కారు గుప్పిట్లో
అవసరమా తిప్పుకొనే
అనవసర ఇక్కట్లు



-వేల్పుల నారాయణ
9440433475

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 5-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:116 పేజీలు:6 వెల: రూ.1/-


## మహాకుంభాభిషేక మహోత్సవానికి సీఎంకు ఆహ్వానం..



నల్గొండ, జనవరి 4:యాదగిరిగుట్ట లో ఫిబ్రవరి 19 నుంచి 23 వరకు శ్రీ శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహ స్వామి దివ్యస్వర్ణ విమాన గోపుర మహా కుంభాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు.

శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, యాదగిరిగుట్ట ఆలయ ఈవో, అర్చకులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ సుదర్శన లక్ష్మీనారసింహ దివ్యస్వర్ణ విమాన గోపురం మహాకుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికను సీఎం రేవంత్‌కు అందజేశారు.

## ప్రముఖ అణు శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల చిదంబరం కన్నుమూత

ముంబై జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రముఖ అణు శాస్త్రవేత్త డాక్టర్ రాజగోపాల చిదంబరం(88) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబై జస్‌లోక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. రాజగోపాల చిదంబరం మృతి పట్ల శాస్త్రవేత్తలతో పాటు రాజకీయ ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తున్నారు. అణు శాస్త్రవేత్తగా తన కెరీర్‌ను చిదంబరం ప్రారంభించారు. పొఖ్రాన్-1(1975), పొఖ్రాన్-2 (1998) అణు పరీక్షల్లో రాజగోపాల చిదంబరం కీలకపాత్ర పోషించారు. అణుశక్తి కమిషన్‌కు చైర్మన్‌గా సేవలందించారు. రాజగోపాలకు 1999లో పద్మవిభూషణ్, 1975లో పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. భారత ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా పని చేశారు. బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పని చేశారు. అటామిక్ ఎనర్జి కమిషన్ చైర్మన్‌గా సేవలందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు.

## పోలవరం ప్రాజెక్ట్ ముంపుపై అధ్యయనం- అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

హైదరాబాద్, జనవరి 4: ఏపీలో గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణపై పడే ప్రభావంపై అధ్యయనం చేయాలని నిర్ణయించింది రేవంత్ రెడ్డి. ఈ మేరకు అధ్యయనం బాధ్యతలను ఐఐటీ హైదరాబాద్‌కు అప్పగించింది. నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి నేడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పోలవరం నిర్మాణం నేపథ్యంలో రాష్ట్రంపై ప్రభావం ఎంత మేరకు పడుతుందో తెలుసుకునేందుకు ఐఐటీ హైదరాబాద్ బృందంతో నివేదిక తయారు చేయించాలని సీఎం ఆదేశించారు. నెల రోజుల్లోగా సమగ్ర నివేదిక తయారు చేయాలని చెప్పారు. ఐఐటీ హైదరాబాద్ బృందంతో కో ఆర్డినేషన్ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

**పోలవరంతో భద్రచలంకు ముప్పు ..** జనవరి 4: పోలవరం నిర్మాణంతో మేఖ్యంగా భద్రాచలం దేవాలయానికి ఏర్పడే ముప్పుపై సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. 2022లో 27 లక్షల క్యూసెక్కుల వరద వచ్చిన సమయంలో భద్రాచలం వద్ద ముంపునకు గురైనట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఇక ఏపీ ప్రభుత్వం చేపట్టిన గోదావరి బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాజెక్టుపై ఇటీవల ఏపీ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిందని వివరించారు. వరద జలాల ఆధారంగా నిర్మిస్తున్న ఆ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని సీఎంకు అధికారులు తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలంగాణ అభ్యంతరాలను తెలపాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అవసరమైతే గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుతో పాటు కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని ఆదేశించారు రేవంత్.

## తమిళనాడు జల్లికట్టులో కొట్లాట .. 30 మందికి గాయాలు

-ప్రైజ్ మనీ కోసం వివాదం
-గ్రామస్తుల మధ్య
-30 మందికి గాయాలు
-ఎనిమిది మంది పరిస్థితి విషమం..



చెన్నై, తమిళనాడులో పుదక్కోట్టైలో జలికట్టు క్రీడ నిలిచిపోయింది. శనివారం పుదుక్కోట్టై లో జల్లికట్టు క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు తిరుచ్చి, దిండిగల్, మనప్పరై, పుదుక్కోట్టై, శివగంగై జిల్లాల నుంచి దాదాపు 600కి పైగా ఎద్దులతో రైతులు హాజరయ్యారు. సుమారు 300 మందికిపైగా యువకులు ఎద్దులను నిలవరించేందుకు సిద్ధపడ్డారు. ఇంతలో ప్రైజ్‌మనీ కోసం వివాదం ప్రారంభమైంది. రెండు వర్గాల మధ్య కొట్లాట చోటు చేసుకుంది.

**30 మందికి గాయాలు**

పుదుక్కోట్టైలో జల్లికట్టు గ్రౌండ్‌లో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగింది. కుర్చీలు విసురుకున్నారు. ఈ కొట్లాటలో ముప్పయి మంది గాయపడ్డారు. అందులో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంది. తమిళనాడులో పొంగల్ పండుగ సందర్భంగా ఏటా జనవరిలో జల్లికట్టు నిర్వహిస్తారు. ఇరువర్గాలను పోలీసులు సముదాయించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో జల్లికట్టు ఆటను నిలిపివేశారు.

**అనాదిగా ఆచారం**

తమిళనాడు రాష్ట్రంలో ఇది అనాదిగా వస్తున్న ఆచారం. ప్రతి సంక్రాంతి సందర్భంగా తమిళనాడులో జల్లికట్టు ఉత్సవం జరుపుకుంటారు. జల్లికట్టు అంటే ఎద్దులను, కోడెలను బెదరగొట్టి ఒక మార్గం గుండా గుంపులుగా వదిలిపెడుతారు. గుంపులుగా పరుగులు తీస్తున్న ఎద్దులను యువకులు లొంగిదీసే ప్రయత్నం చేస్తారు. అలా లొంగదీసిన వ్యక్తిని విజేతగా ప్రకటిస్తారు. జనవరి నుంచి మే 31 మధ్య సాధారణంగా 120కిపైగా జల్లికట్టు ఈవెంట్‌లు నిర్వహిస్తారు. ఈ సంప్రదాయ ఎద్దుల క్రీడలను చూసేందుకు తమిళనాడు వ్యాప్తంగానే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తుంటారు.

## లోయలో పడిన ఆర్మీ వాహనం.. నలుగురు జవాన్లు మృతి



న్యూఢిల్లీ, జనవరి 4: జమ్ము కశ్మీర్ లో ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్మీ వాహనం అదుపుతప్పి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో నలుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు గాయపడ్డట్లు అధికారులు తెలిపారు.

బందిపూర్ జిల్లాలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని సదర్ కూట్ పాయెన్ సమీపంలోని ఓ వంపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. అప్రత్తమైన భద్రతా బలగాలు, పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ జవాన్లను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

కశ్మీర్ లోయలో ఇలా ఆర్మీ వాహనాలు ప్రమాదానికి గురి కావడం ఇదేమీ తొలిసారి కాదు. గతేడాది డిసెంబర్ 24వ తేదీన పూంచ్ జిల్లాలో ఆర్మీ వాహనం అదుపుతప్పి 350 అడుగుల లోయలోకి పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించగా.. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటనలో ఎలాంటి ఉగ్రకోణం లేదని ఆర్మీ స్పష్టం చేసింది. అంతకుముందు నవంబర్ 4న రాజౌరి జిల్లాలో వాహనం స్కిడ్ అయి లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఆర్మీ సిబ్బంది ఒకరు ప్రాణాలు కోల్పోయారు.

## తెలంగాణ జనాభాలో 55 శాతం బీసీలే.. కులగణన సర్వేలో వెల్లడి..!!

-ఎస్సీ, ఎస్టీ, ఓసీ, ఇతరులు కలిపి 45 శాతం
-సర్వే నివేదిక సిద్ధం చేసిన ప్రణాళిక సంఘం

హైదరాబాద్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );:రాష్ట్రంలో బీసీల జనాభాపై స్పష్టత వచ్చింది. మొత్తం జనాభాలో 55 శాతం మేర బీసీలు ఉన్నట్టు తెలిసింది. ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సర్వేలో ఈ విషయం వెల్లడైనట్టు సమాచారం. కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రణాళిక సంఘం సిద్ధం చేసింది.ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నందున.. ఇప్పటికే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం బీసీ డెడికేటెడ్ కమిషన్ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ క్షేత్రస్థాయిలో వివరాలు, వినతులు తీసుకున్నది. సమగ్ర కులగణన సర్వేకు సంబంధించిన వివరాలు కూడా కమిషన్ కు అందాయి. కాగా, పోయినేడాది నవంబర్లో ప్రభుత్వం కులగణన సర్వే చేపట్టింది.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు నెలన్నర పాటు 90వేల మందికి పైగా ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేశారు. ఆ వివరాల డిజిటలైజేషన్ కూడా పూర్తయింది. కులగణన సర్వే రిపోర్టును ప్రణాళిక సంఘం దాదాపు సిద్ధం చేసింది. సర్వేలో భాగంగా మొత్తం కోటి 17లక్షల 47వేల ఇండ్లకు స్టిక్కరింగ్చేయగా, ఇందులో 98 శాతం మేర వివరాలు సేకరించారు. ఇందులో 55 శాతం మేర బీసీలు ఉన్నట్టు తెలిసింది. మిగతా 45 శాతం ఎస్సీ, ఎస్టీ, ఓసీ, ఇతరులు ఉన్నట్టు సమాచారం. ఇక కులగణన సర్వేకు సంబంధించి అన్ని వివరాలతో కూడిన పూర్తిస్థాయి రిపోర్టును త్వరలోనే ప్రభుత్వం విడుదల చేయనుంది.

## ఇన్ఫీ మాజీ సీఈఓ విశాల్ సిక్కాతో ప్రధాని మోదీ భేటీ.. ఏం చర్చించారంటే..!



న్యూఢిల్లీ, జనవరి 4: ఇండో అమెరికన్ పారిశ్రామికవేత్త, ఇన్ఫోసిస్ మాజీ సీఈఓ విశాల్ సిక్కా శనివారం ప్రధాని నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో దిగిన ఫోటోను సోషల్ మీడి యావేదిక ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల భారత్ మీద చూపే ప్రభావంపై ప్రధాని మోదీతో చర్చించినట్లు చెప్పారు. 'ప్రధాని నరేంద్రమోదీతో భేటీ కావడం గర్వకారణం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, దానివల్ల భారత్‌పై ప్రభావంపై మోదీ విస్తృత స్థాయి చర్చలు జరిపాం. ఈ భేటీ తర్వాత టెక్నాలజీపై ప్రధాని మోదీకి గల అసాధారణ పరిజ్ఞానం నన్ను అబ్బుర పరిచింది. ప్రజాస్వామ్య విలువలతోపాటు దాన్ని ఉపయోగంతో ప్రతి ఒక్కరి అభ్యున్నతికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా ఉపయోగించాలో తెలుసుకున్నాం' అని ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

విశాల్ సిక్కా గతంలో 2014 నుంచి 2017 వరకూ ఇన్ఫోసిస్ సీఈఓ కం మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేశారు. ఇన్ఫోసిస్ సీఈఓగా నియమితులైన తొలి నాన్ ఫౌండర్ విశాల్ సిక్కా. అయితే కంపెనీ బోర్డు డైరెక్టర్లు, ఫౌండర్లకు మధ్య విభేదాలు తలెత్తడంతో 2017లో రాజీనామా చేశారు. ఆయన తన సొంత ఏఐ బేస్డ్ స్టార్టప్ వైనాయి సిస్టమ్స్‌తోపాటు పలు వెంచర్లలో భాగస్వామిగా ఉన్నారు. 2002 నుంచి 2014 ఆగస్టు వరకూ జర్మనీ టెక్నాలజీ మేజర్ 'ఎస్ఏపీ'లో సుదీర్ఘకాలం పని చేశారు. 12 ఏండ్ల కాలంలో సంస్థ సీటీవో, ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యుడిగా ఉన్నారు.

విశాల్ సిక్కా చేసిన ట్వీట్‌ను ప్రధాని మోదీ రీ ట్వీట్ చేశారు. తమ ఇద్దరి భేటీ పరస్పర అవగాహన పెంచుకోవడానికి ఉపకరించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నాయకత్వం వహించేందుకు భారత్ కట్టుబడి ఉంది. యువత కోసం ఇన్నోవేషన్, అవకాశాల కల్పపై దృష్టి పెడతామని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## ఎయిర్‌పోర్ట్ టాయిలెట్‌లో కాల్చుకుని.. సీఐఎస్ఎఫ్ జవాన్ ఆత్మహత్య

న్యూఢిల్లీ, జనవరి 4:ఎయిర్‌పోర్ట్‌లో విధులు నిర్వహిస్తున్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) జవాన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టాయిలెట్‌లోకి వెళ్లి సర్వీస్ గన్‌తో కాల్చుకుని మరణించాడు.ఆ జవాన్ ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడో అన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గుజరాత్‌లోని సూరత్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఈ సంఘటన జరిగింది. జైపూర్‌కు చెందిన 32 ఏళ్ల కిషన్ సింగ్ సీఐఎస్ఎఫ్ జవాన్‌గా అక్కడ విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎయిర్‌పోర్ట్‌లోని టాయిలెట్‌కు వెళ్లాడు. సర్వీస్ రైఫిల్‌తో పొట్టలో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కాగా, గమనించిన సీఐఎస్ఎఫ్ సిబ్బంది, కిషన్ సింగ్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ జవాన్ అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. కిషన్ సింగ్ ఎందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడో అన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ విషయం తెలిసి ఎయిర్‌పోర్ట్‌లోని సిబ్బంది భయాందోళన చెందారు.

## వైకుంఠ ఏకాదశి వేళ భక్తులకు టీటీడీ చైర్మన్ కీలక సూచనలు



తిరుపతి, జనవరి 4:వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో సామాన్య భక్తులు ప్రశాంతంగా శ్రీవారిని దర్శించుకునేలా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్. నాయుడు తెలిపారు. 2025 జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు భక్తులు శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా టీటీడీ అధికారులు, మునిసిపల్ అధికారులు, పోలీసు అధికారులతో కలిసి శనివారం రామచంద్ర పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. భక్తులు సంయమనం పాటించి శ్రీవారిని దర్శించుకోవాలని సూచించారు. 10 రోజుల పాటు భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసేందుకు వీలుగా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు జారీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇందుకోసం తిరుపతిలోని 8 కేంద్రాలలో 90 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 94 కౌంటర్లలో టోకెన్లు మంజూరు చేస్తారన్నారు.

తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, బైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కోసం తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారని బీఆర్ నాయుడు తెలిపారు.

జనవరి 13 నుంచి 19వ తేదీ వరకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లను తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో మాత్రమే టోకెన్లు జారీ చేసేందుకు వీలుగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తిరుపతిలో భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లు, బారికేడ్లు, షెడ్లు, భద్రత, తాగునీరు, మరుగుదొడ్లు తదితర పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## హెచ్‌ఎంపివి వైరస్ - జాగ్రత్తలు పాటించాలంటూ వైద్య శాఖ ఆదేశం..

హైదరాబాద్, జనవరి 4: చైనాలో వ్యాప్తి చెందుతున్న హెచ్‌ఎంపివి వైరస్ తెలంగాణ ప్రభుత్వం అప్రవత్తమైంది... ఈ వ్యాధి తెలంగాణలోకి రాకుండా తెలంగాణ వైద్య శాఖ ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది.. శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల నుండి సురక్షితంగా ఉండటానికి కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది తెలంగాణ ఆరోగ్య శాఖ. రద్దీగా ఉండే ప్రదేశాలను నివారించాలని, సబ్బు లేదా శానిటైజర్‌తో చేతులను తరచుగా కడగాలని కోరింది. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకూడదని, అనారోగ్యంగా ఉన్న వ్యక్తులు దగ్గరకి వెళ్లకూడదని అంటూ కొన్ని సూచించింది.. బయటకు వచ్చే సమయంలో మాస్క్ వాడటం మంచిదని పేర్కొంది.

## చలి తీవ్రతకు వణుకుతోన్న ఉత్తర భారతం

– 40 విమానాలను రద్దు చేసిన అధికారులు

న్యూ డిల్లీ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );చలి తీవ్రతకు ఉత్తర భారతం వణుకుతోంది. ఢిల్లీ సహా హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, బీహార్ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. దీంతో దట్టమైన పొగ మంచు కమ్మేసింది పొగమంచు కారణంగా విమాన, రైలు సర్వీసులకు ఆటంకం ఏర్పడింది దట్టమైన పొగమంచు కారణంగా ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విజిబిలిజీ జీరోకు పడిపోయింది. దీంతో ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు రాకపోకలు సాగించే దాదాపు 250 విమానాలు ఆలస్యమయ్యాయి. 40 విమానాలను అధికారులు రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించినట్లు అధికారులు తెలిపారు. స్పైస్‌జెట్, ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి.

## తెలంగాణను వణికిస్తోన్న చలి

-సంగారెడ్డి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు

హైదరాబాద్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ న్యూస్ );: తెలంగాణను చలి వణికిస్తోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎముకలు కొరికే చలి ఉండడంతో పిల్లలు, వృద్ధులు వణికిపోతున్నారు. ఇంటి నుంచి కాలు తీసి బయట పెట్టాలంటేనే భయపడపోతున్నారు. ఉదయం 10 గంటల వరకు చలి వీడడం లేదు. మంచు కూడా విపరీతంగా కురుస్తుండటంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ఇక సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సిర్పూర్ యూ(ఆసిఫాబాద్)లో 6.1, అర్లి(టి)(ఆదిలాబాద్)లో 6.2, గిన్నెదరి(ఆసిఫాబాద్)లో 6.2, న్యాల్‌కల్ (సంగారెడ్డి)లో 6.3, రెడ్డిపల్లి(సంగారెడ్డి)లో 6.8, డోంగ్లీ(కామారెడ్డి)లో 6.8, చందనపల్లి(రంగారెడ్డి)లో 6.9, బేల(ఆదిలాబాద్)లో 6.9, తిర్యాని(ఆసిఫాబాద్)లో 7.1, అల్మాయిపేట(సంగారెడ్డి)లో 7.3, ఎలిమినేడు(రంగారెడ్డి)లో 7.4, రాంనగర్(ఆదిలాబాద్)లో 7.5, మల్‌చెల్మ(సంగారెడ్డి)లో 7.5, మేనూరు(కామారెడ్డి)లో 8.2, బోడాగల్(మెదక్)లో 8.4, రాజాపూర్(మహబూబ్‌నగర్)లో 8.4, కోట్‌పల్లి(వికారాబాద్)లో 8.5, నిర్మల్ జిల్లా కుబీర్‌లో 8.8, పెంబీలో 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# మా ప్రభుత్వ ఉద్దేశాలు, విధానాలు మరియు నిర్ణయాలు గ్రామీణ భారతదేశాన్ని కొత్త శక్తితో శక్తివంతం చేస్తున్నాయి: ప్రధాని

న్యూఢిల్లీ, జనవరి 4:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గ్రామీణ భారత్ మహోత్సవ్ 2025ను ప్రారంభించారు. విక్షిత్ భారత్ 2024 కోసం నిలకడగల గ్రామీణ భారతదేశాన్ని నిర్మించడం అనేది మహోత్సవ్ యొక్క థీమ్. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, 2025 సంవత్సరం చాలా సంతోషంగా ఉందని ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నంవత్సరం ప్రారంభంలో గ్రామీణ భారత్ మహోత్సవ్‌ని గొప్పగా నిర్వహించడం భారతదేశ అభివృద్ధి ప్రయాణానికి ఒక సంగ్రహావలోకనం ఇస్తోందని మరియు ఒక గుర్తింపును సృష్టిస్తోందని అన్నారు. అదే. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాబార్డ్‌తో పాటు సహాయకులను అభినందించారు.

గ్రామాల్లో పుట్టి పెరిగిన మనకు గ్రామాల శక్తిసామర్థ్యాలు తెలుసునని ప్రధాని వ్యాఖ్యానించారు. గ్రామాల్లో నివసించే వారిలో కూడా గ్రామ స్ఫూర్తి ఉంటుందని ఆయన అన్నారు. గ్రామాలలో నివసించే వారికి కూడా గ్రామం యొక్క నిజమైన జీవితాన్ని ఎలా గడపాలో తెలుసునని ఆయన అన్నారు. తన బాల్యాన్ని ఒక చిన్న పట్టణంలో సాదాసీదా వాతావరణంతో గడపడం తన అదృష్టమని శ్రీ మోదీ అన్నారు. ఆ తర్వాత ఊరు విడిచి వెళ్లాక పల్లెల్లో గడిపానని తెలిపారు.

నేను కష్టాలను చవిచూశాను మరియు గ్రామం యొక్క అవకాశాల గురించి కూడా నాకు తెలుసు", అని ప్రధాన మంత్రి అన్నారు. గ్రామంలోని ప్రజలు కష్టపడి పనిచేస్తున్నప్పటికీ, రాజధాని లేకపోవడంతో సరైన అవకాశాలను కోల్పోతారని చిన్నప్పటి నుంచి గమనిస్తున్నానని తెలిపారు. గ్రామస్తులు వివిధ రంగాలలో విభిన్నమైన బలాలు కలిగి ఉన్నప్పటికీ, వారి కనీస సౌకర్యాలను సంతృప్తి పరచాలనే తపనతో కోల్పోతున్నారని ఆయన అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, మార్కెట్లు అందుబాటులో లేకపోవడం వంటి విభిన్న సవాళ్లు రైతులు ఎదుర్కొంటున్నాయని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. వీటన్నింటిని చూసిన తర్వాత, అతను తన మనస్సును పరిష్కరించుకున్నాను మరియు వారు ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవటానికి ప్రోత్సహించబడ్డాడు. గ్రామాలలో పాఠాలు, అనుభవాల స్ఫూర్తితో నేడు గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. 2014 నుండి తాను గ్రామీణ భారతదేశానికి నిరంతరం సేవ చేస్తున్నానని శ్రీ మోదీ అన్నారు.

"గ్రామీణ భారతదేశంలోని ప్రజలకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం నా ప్రభుత్వం యొక్క ప్రాధాన్యత" అని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు. సాధికారత కలిగిన గ్రామీణ భారతదేశాన్ని నిర్ధారించడం, గ్రామస్థులకు పుష్కలమైన అవకాశాలను అందించడం, వలసలను తగ్గించడం మరియు గ్రామాల ప్రజల జీవన సౌలభ్యాన్ని నిర్ధారించడం తమ దృష్టి అని ఆయన అన్నారు. అందుకోసం ప్రతి గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఒక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి, ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా గ్రామీణ భారతదేశంలో కోట్లాది మందికి పక్కా గృహాలు అందించామని, జల్ జీవన్ ద్వారా గ్రామాల్లోని లక్షలాది ఇళ్లకు సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని శ్రీ మోదీ హైలైట్ చేశారు. మిషన్.

"నేడు, ప్రజలకు 1.5 లక్షలకు పైగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో ఆరోగ్య సౌకర్యాలు అందించబడుతున్నాయి" అని ప్రధాన మంత్రి అన్నారు. డిజిటల్ టెక్నాలజీల సహాయంతో టెలిమెడిసిన్ గ్రామాలకు ఉత్తమ వైద్యులు మరియు ఆసుపత్రుల ఎంపికను నిర్ధారించిందని ఆయన అన్నారు. ఈ-సంజీవిని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కోట్లాది మంది ప్రజలు టెలిమెడిసిన్ ద్వారా లబ్ధి పొందారని ఆయన తెలిపారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో భారతదేశ గ్రామాలు ఎలా తట్టుకోగలవని ప్రపంచం ఆశ్చర్యపోతోందని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, ప్రతి గ్రామంలోని చివరి వ్యక్తికి టీకాలు చేరేలా ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆయన తెలిపారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు గ్రామీణ సమాజంలోని ప్రతి వర్గాన్ని పరిగణనలోకి తీసుకునే ఆర్థిక విధానాలను రూపొందించడం యొక్క ప్రాముఖ్యతను ప్రధాన మంత్రి హైలైట్ చేశారు. గడిచిన 10 ఏళ్లుగా గ్రామంలోని ప్రతి వర్గానికి ప్రభుత్వం ప్రత్యేక విధానాలు రూపొందించి నిర్ణయాలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితమే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని మరో ఏడాది పొడిగించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, డీఏపీపై సబ్సిడీని కొనసాగించాలని నిర్ణయించామని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్దేశాలు, విధానాలు, నిర్ణయాలు గ్రామీణ భారతదేశంలో కొత్త శక్తిని నింపుతున్నాయని ఆయన ఉద్ఘాటించారు.

# చిల్లు పడింది మేడిగడ్డకు కాదు.. చిట్టినాయుడి బుర్రకు: కెటిఆర్

రాజన్న సిరిసిల్ల, జనవరి 4: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ మాత్రమే అమలైందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్. రెండు లక్షల రుణమాఫీ.. వందశాతం అమలైతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో చెప్పానన్నారు. అయిన ఆ పార్టీలో చలనం లేదని అన్నారు. సిరిసిల్లలో నేడు జరిగిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ..

కాంగ్రెస్‌కు పరిపాలన చేతకావడం లేదని చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి అంటూ విమర్శించారు.

ఇక మేడిగడ్డకు చిల్లు పడిందని కాంగ్రెస్ వీర ప్రచారం చేస్తున్నదని, అయితే వాస్తవానికి చిల్లుపడింది రేవంత్ బుర్రకంటూ సెటైర్ వేశారు.. ఇప్పుడు అవేనీళ్ళు హైదరాబాద్ తాగునీటి కోసం రేవంత్ రెడ్డి తీసుకెళుతున్నారని చెప్పారు. ఇక రాష్ట్రంలో నాలుగు లక్షల పెళ్లిళ్లు అయ్యాయని.. వారికి కల్యాణలక్ష్మి ఇవ్వలేదన్నారు. రూ.7500 రైతుబంధు కాదుకదా.. 75 పైసలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

రైతు ప్రమాణపత్రం కేసీఆర్ హయాంలో అడుగలేదని.. రైతుబంధు ఇచ్చామన్నారు. 11 దఫాల్లో రూ.80వేలకోట్లు రైతుల ఖాతాల్లో రైతుబంధు జమైందని వివరించారు. రైతులని బద్నాం చేసే కుట్ర జరుగుతుందని.. రైతులను దొంగల్లా చిత్రీకరించే కుట్రకు ప్రభుత్వం తెరలేపిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగం, ఐటీ ఉంటే రైతుబంధు కట్ అంటున్నారని.. సీఎం రేవంత్ కట్టింగ్ సీఎం అయ్యారన్నారు.

కోటిన్నర ఎకరాలకి నీళ్లు ఇవ్వాల్సి వస్తుంది కాబట్టే కాళేశ్వరాన్ని బాగు చేయడం లేదని ఆరోపించారు. ప్రేక్షక పాత్ర కాదు అన్యాయం జరిగితే కొట్లాడాలని పిలుపునిచ్చారు. చిట్టినాయుడు ఏం పీకలేడన్నారు. అతివిశ్వాసం.. చిన్నచిన్న తప్పిదాలతో అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయామని.. కేసీఆర్ దేశాన్ని శాసించే రోజులు మళ్లీ వస్తాయన్నారు. ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాది అయినా.. కేసీఆర్ జపం చేస్తున్నారన్నారు. రాష్ట్రం దివాళా తీసిందని సీఎం చెబుతున్నారని.. పరిపాలన చేతకాక మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రెగ్యులేషన్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్ దోపిడీ.. దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బాధితులు



నిజామాబాద్, జనవరి 4:ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రవేట్ ఆసుపత్రుల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ హాస్పిటల్ బాధితుల సమితి సభ్యులు డిమాండ్ చేశారు. నగరంలోని స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో కొన్ని ప్రైవేటు హాస్పిటల్స్, మెడికల్ ల్యాబ్, స్కానింగ్ సెంటర్ల మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ హాస్పిటల్ బాధితుల సమితి ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రైవేట్ హాస్పిటల్స్ మాఫియా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

ఈసందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో కొన్ని ప్రైవేట్ హాస్పిటళ్లలో మెడికల్ ల్యాబ్, స్కానింగ్ మాఫియా నడుస్తుందని మండిపడ్డారు. కొంతమంది పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పల్లెల నుండి నగరానికి వైద్యం కోసం వస్తే కొంతమంది మాఫియా ధనార్జనే ధ్యేయంగా అవసరం లేని టెస్టులు రాస్తూ డబ్బులు దండుకుంటు న్నారని ఆరోపించారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కొన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ మెడికల్, ల్యాబ్, స్కానింగ్ మాఫియాపై సంబంధిత ప్రభుత్వ శాఖ అధి కారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిల్లి శ్రీకాంత్, హన్మాండ్లు (బుజ్జి), రాజ్ గణేష్, అజిగిరి రాకేష్, నల్ల నవీన్, సాయికుమార్, చంటి, సతీష్, నవీన్, మధు, ప్రశాంత్, సుజిత్, కళ్యాణ్, కృష్ణ, ప్రసాద్, అక్షయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# సాగరతీరంలో అబ్బురపర్చిన నేవీ విన్యాసాలు..

అమరావతి, జనవరి 4:విశాఖ తీరంలో భారత నావికాదళం 'నేవీ డే'ని అట్టహాసంగా నిర్వహించింది. ఆర్‌కే బీచ్‌లో ఇండియన్ నేవీ నిర్వహించిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సతీమణి నారా భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు. ఇండియన్ నేవీ అధికారులు కూడా పాల్గొన్నారు. ఇక నౌకాదళ విన్యాసాలను వీక్షించేందుకు వచ్చిన జనంతో విశాఖ తీరం జనసంద్రంగా మారింది.



ఈ సందర్భంగా నౌకాదళం తన ధైర్యసాహసాలను ప్రదర్శించింది. 8 వేల అడుగుల ఎత్తు నుంచి పారాచూట్ సాయంతో జాతీయ జెండా, నౌకాదళ జెండాను ఎగురవేసి ఔరా అనిపించారు. యుద్ధ విమానాలు, హెలీక్యాప్టర్లతో విన్యాసాలు చేశారు. అక్కడ మోహరింపజేసిన ట్యాంకర్లు, నౌకలు అందరినీ అలరించాయి. సముద్రంలో బంకర్ పేలుళ్లను కళ్లకు కట్టినట్టు చూపించారు.

# ఇంద్రకీలాద్రిపై అధ్వానంగా పారిశుధ్యం.. ఇన్చార్జి ఈవో ఆగ్రహం

-భక్తులకు ఇలాగేనా స్వాగతం పలికేది
-పారిశుధ్య నిర్వహణపై ఇన్చార్జి ఈవో ఆగ్రహం
-క్యూలైన్లు, అంతరాలయం పలు ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీ
-ఇంద్రకీలాద్రిపై అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
-కనీసం పట్టించుకోని సిబ్బంది తీరుపై ఆక్షేపణ
-పర్యవేక్షణ లేదంటూ అధికారులకు తలంటు
-ఈవో ఆగ్రహంతో రంగంలోకి దిగిన అధికారులు, సిబ్బంది
-హుటా హుటిన పారిశుద్ధ్యం, బూజు దులుపుతున్న కార్మికులు

అమరావతి, జనవరి 4: నిత్యం వేల సంఖ్యలో అమ్మవారి దర్శనానికి పవిత్ర హృదయంతో వచ్చే భక్తులకు ఇలా స్వాగతం పలుకుతున్నారా అంటూ ఇన్చార్జి ఈవో రామచంద్ర మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని క్యూలైన్లు, ప్రధాన ఆలయంతో పాటు పలు ప్రాంతాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ



చేశారు. క్యూలైన్లు అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన క్యూలైన్ లో అపరిశుభ్రంగా ఉన్న పరిస్థితులను చూసి ఆశ్చర్యపోయారు.

క్యూలైన్ లో ఎక్కడి చెత్త అక్కడే ఉండడం, భక్తులు నడిచే ప్రాంతాలలో ఇనుప రాడ్లు, ఇతర వస్తువులతో పాటు, బూజు పట్టిపోయి ఉన్న గోడలు ఫ్యాన్లను చూసి సిబ్బంది, ఇతర అధికారులను పిలిపించి ప్రశ్నించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ రీతిలో మీారు స్వాగతం పలుకుతున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండపై పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడం దారుణమని, సిబ్బంది పనితీరు ఎలా ఉంటే అధికారుల సైతం పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తుందని అధికారులకు అక్షింతలు వేశారు. పై స్థాయి అధికారులు కూడా పట్టించుకోకపోవడం పట్ల ఇన్చార్జి ఈఓ రామచంద్ర మోహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంద్రకీలాద్రిపై ఉన్న అన్ని ప్రాంతాలలో పూర్తిస్థాయిలో పరిశుభ్ర వాతావరణ ఉండాలని, తక్షణమే దానికి సంబంధించిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఈఓ ఆగ్రహంతో రంగంలోకి సిబ్బంది..**

ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ప్రధానాలయం క్యూలైన్లతో పాటు ఇతర ప్రాంతాల్లో శనివారం ఆకస్మికంగా పర్యటించిన ఇన్చార్జి ఈవో రామచంద్ర మోహన్ సిబ్బంది అధికారులపై పారిశుధ్య నిర్వహణ పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పారిశుద్ధ కార్మికులు సిబ్బంది అధికారులకు రంగంలోకి దిగారు. ప్రధాన ఆలయం క్యూలైన్లతో పాటు రాజగోపురం, ఘాట్ రోడ్డు, సమాచార కేంద్ర పరిసర ప్రాంతాలలో బూజు దులపడం, పెరిగిన పిచ్చి మొక్కలను తీయడంతో పాటు, అస్తవ్యస్తంగా ఉన్న ఇనుప రాడ్లు, వైర్లను సరి చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇన్చార్జి ఈవో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేయడం ఉన్నతాధికారులకు తలంటడంతో చేరుకున్న వీరు పారిశుద్ధ్య పనులు ఇంద్రకీలాద్రిపై ముమ్మరం చేశారు.

# అర్జున్ అవార్డు గ్రహీత దీప్తికి చిరంజీవి సత్కారం

**-రూ.మూడు లక్షలు ఆర్థిక సాయం అందజేత**
**-మరిన్ని విజయాలు సాధించాలని ఆశీస్సులు**

హైదరాబాద్, జనవరి 4:పారా ఒలింపిక్స్ విజేత జీవాంజి దీప్తిని మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. ఇటీవల గోపీచంద్ బ్యాడ్మింటన్



అకాడమీలో దీప్తికి నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. పారాలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు టీ-20 విభాగంలో కాంస్య పతకం సాధించిన జీవాంజి దీప్తి ప్రతిభకు తగిన గుర్తింపు లభించిందని కొనియాడారు. ఈ సందర్భంగా తెలంగాణ అమ్మాయికి శాలువా కప్పి సన్మానించారు. ఆ తర్వాత రూ.3లక్షల చెక్ కూడా అందజేసి ఆటలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కాగా పిలిచిన వెంటనే ఈ సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవికి ఇండియన్ నేషనల్ బాడ్మింటన్ టీమ్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

'ఇటీవల మన తెలుగు రాష్ట్రాల నుంచి పారా అథ్లెట్ ఒలింపిక్స్‌లో మెడల్ సాధించిన అమ్మాయి దీప్తి జీవాంజి. వరంగల్‌లోని ఓ చిన్న గ్రామంలో పుట్టి పెరిగిన ఆమె దేశానికెంతో పేరుని తెచ్చారు. ఒలింపిక్స్‌లో మెడల్ సాధించిన సందర్భంగా మీకేం కావాలని నేను ఆమెను అడిగినప్పుడు, చిరంజీవిగారిని కలవాలనుందని చెప్పారు. ఇటీవల నేను చిరంజీవిగారిని ఓ సందర్భంలో కలిసినప్పుడు దీప్తి జవాంజి గురించి చెప్పాను. ఆయన చాలా గొప్ప మనసుతో స్పందించారు. చాలా పెద్ద అచీవ్‌మెంట్ చేసినప్పుడు, ఆమె రావటం కాదు, నేను అకాడమీకి వస్తానని అన్నారు. అన్నట్లుగానే చిరంజీవిగారు మా అకాడమీకి వచ్చి, అక్కడున్న పిల్లలందరినీ కలిశారు.

రెండు గంటల పాటు అక్కడే గడిపారు. అలాగే ప్రతీ ఒక్క ప్లేయర్‌ని ఇన్‌స్పైర్ చేసే విధంగా మాట్లాడారు. ఇదే సందర్భంలో ఆయన మూడు లక్షల రూపాయల చెక్‌ను దీప్తికి అందించటం అనేది మాకెంతో సంతోషాన్నిచ్చింది. ఇది మా స్పోర్ట్స్ పర్సన్స్‌కి చిరంజీవి ఇచ్చిన గొప్ప గౌరవంగా నేను భావిస్తాను. ఈ ఇన్‌స్పిరేషన్‌తో చాలా మంది మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని నేను భావిస్తున్నాను' అని తన ప్రకటనలో తెలియజేశాడు గోపీచంద్.

# నాగోబా జాతరకు ముహూర్తం ఫిక్స్..

**-జాతర ఉత్సవాలకు తెరలేపిన మేస్రం వంశీయులు**
**-ఏడు గ్రామాలకు జాతర ఆహ్వానం**

ఆదిలాబాద్, జనవరి 4: ప్రకృతి ఆరాధకులైన ఆదివాసులు పుష్యమాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఏటా ఈ మాసంలో ఆరాధ్య దైవం వర ప్రదాయినిగా నాగోబా ఉత్సవాలు జరపడం ఆనవాయితీ. ఆదివాసి సంప్రదాయం ప్రకారం అత్యంత కఠిన నియమనిష్ఠలతో ఏటా పుష్య మాసంలో ఈ పూజలు జరపడం జరుగుతుంది.

శుక్రవారం ప్రఖ్యాతిగాంచిన కేస్లాపూర్ గ్రామం నుండి రథయాత్రను ప్రారంభించారు. ఈనెల 28న జరిగే కేస్లాపూర్ నాగోబా జాతరకు తమ కులస్తులను ఆహ్వానంగా మర్యాదపూర్వకంగా ఏడు గ్రామాల్లో మకాం వేస్తూ వారిని పిలుస్తారు. ఈ సందర్భంగా కటోడ ప్రధాన్ లు ఈ రథంపై వెళ్లడం ఆనవాయితీ. నేడు కేస్లాపూర్ కుండా సిరికొండ మండలం రాజంపేట వద్ద బసచేస్తూ ఆనవాయితీగా జాతరకు కుండలు చేసే కుమ్మరికి నూతన కుండలను నిర్మించడానికి ఆదేశిస్తారు. అలాగే 4వ తేదీ, రాజంపేట నుండి కువాడికి వెళ్తారు.

5వతేదీ నా సోయంగూడకు వెళ్తారు. 6వ తేదీ సోయంగూడ నుండి గిన్నెరకు వచ్చి బస చేస్తారు. 7వతేదీన గిన్నె రా నుండి సాలివాడకు వెళ్తారు. అలాగే 8వ తేదీన సాలివాడ నుండి బయలుదేరి వడగంలో బస చేస్తారు. 9వతేదీన పొడగమ నుండి బయలుదేరి కేస్లాపూర్ నుండి ఇంటి వద్దకు వస్తారు. ఇలా ఏడు రోజులపాటు వీరి సంస్కృతిలో భాగంగా జాతరకు ఆహ్వానంగా బంధుమిత్రులను పిలవడం అనవాయితీ.

# సుష్మాజీ వ్యవహార శైలిని చూసి ప్రతిపక్ష నేతలందరూ నేర్చుకోవాలి




న్యూఢిల్లీ, జనవరి 4:న్యూ ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఔఆఓఙ) అభివృద్ధి చేసిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ బ్లాక్ సుష్మా భవన్‌ను కేంద్ర హోం మంత్రి మరియు సహకార మంత్రి శ్రీ అమిత్ షా ప్రారంభించారు. న్యూ ఢిల్లీలోని మోతీ బాగ్‌లో అత్యాధునిక పశు వైద్యశాలను ఆయన వాస్తవంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వి కె సక్సేనా మరియు న్యూఢిల్లీ పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి బాన్సూరి స్వరాజ్ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

శ్రీ అమిత్ షా తన ప్రసంగంలో, సుష్మా జీ పేరుతో ఉన్న ఈ భవనంలో నివసిస్తున్న సోదరీమణులు, భారతదేశంలో మహిళా సాధికారత, అవగాహన మరియు పోరాటానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమైన నాయకుడితో అనుబంధం కలిగి ఉన్నారని హైలైట్ చేశారు. రూ.కోట్ల అవినీతి, కుంభకోణాలను బట్టబయలు చేసిన దృఢమైన ప్రతిపక్ష నేతగా ఆమె వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 12 లక్షల కోట్లు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకురాలి పాత్రను సుష్మా జీ ఉదహరించారని, మహిళా సాధికారత కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేశారని శ్రీ షా పేర్కొన్నారు. సుష్మాజీ వ్యవహార శైలిని చూసి ప్రతిపక్ష నేతలంతా నేర్చుకోవాలని అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వంలో విదేశాంగ మంత్రిగా, ప్రజల సమస్యలను కరుణ మరియు సమర్థతతో పరిష్కరించడం ద్వారా ఆమె ఒక అద్భుతమైన ఉదాహరణగా నిలిచింది, భారత దౌత్యంపై చెరగని ముద్ర వేసింది.

సుష్మా భవన్ నిర్మాణం ద్వారా దాదాపు 500 మంది శ్రామిక మహిళలకు ఎన్‌డిఎంసి సురక్షిత వసతిని కల్పించిందని కేంద్ర హోం మంత్రి తెలిపారు. ఈ భవన ప్రారంభోత్సవం ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పట్టణాభివృద్ధి దార్శనికతను హైలైట్ చేయడంలో ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అన్నారు. 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రధాని మోదీ భారతదేశ పట్టణ ప్రకృతి దృశ్యాన్ని మార్చేందుకు బలమైన విధాన పునాదిని వేశారని ఆయన అన్నారు. గ్లోబల్-స్టాండర్డ్ సౌకర్యాల ప్రాముఖ్యతను ప్రధాని మోదీ నొక్కిచెప్పారని, పట్టణాభివృద్ధి విధానంలో వాటిని కేంద్ర అంశంగా చేర్చారని శ్రీ షా పేర్కొన్నారు. గత దశాబ్దంలో నగరాలను గణనీయంగా మార్చిన పట్టణాభివృద్ధి వ్యూహం లో-గతంలో పట్టించుకోని-పెరి-అర్బన్ గ్రామాలను చేర్చడం ద్వారా ప్రధాని మోదీ జీ కూడా ముఖ్యమైన విధానపరమైన అంతరాన్ని పరిష్కరించారు. డేటా ఆధారిత విధానాన్ని ఉపయోగించి అభివృద్ధి కోసం 100 నగరాలను గుర్తించిన స్మార్ట్ సిటీస్ మిషన్ ద్వారా ఉదహరించబడిన ఇ-గవర్నెన్స్‌పై ప్రధాని మోదీ దృష్టిని హోం మంత్రి హైలైట్ చేశారు. ఈ వినూత్న పద్ధతి నగరాల్లో సమానమైన వృద్ధిని అందించడమే కాకుండా ముందుకు చూసే దృక్పథంతో అభివృద్ధిని సులభతరం చేసిందని ఆయన అన్నారు.

# మహాకుంభ మేళలో శ్రీవారి నమూనా ఆలయం : టీటీడీ చైర్మన్



తిరుపతి, జనవరి 4:ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్ )లో జరుగనున్న మహాకుంభ మేళలో శ్రీవారి నమూనా ఆలయం ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు వెల్లడించారు.

జనవరి 13, 2025 నుంచి ఫిబ్రవరి 26, 2025 వరకు మహాకుంభ మేళ జరుగనున్న నేపథ్యంలో సెక్టార్ 6 లో వాసుకి ఆలయం ప్రక్కన ఏర్పాటు చేస్తున్న శ్రీవారి నమూనా ఆలయం దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేసేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. రామచంద్ర పుష్కరిణి వద్ద మీడియాతో శనివారం ఆయన మాట్లాడారు.

ప్రయాగ్ రాజ్‌లో ఉత్తరాధి భక్తులు శ్రీవారిని దర్శించుకునేలా శ్రీవారి నమూనా ఆలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. తిరుమల తరహాలో శ్రీవారి కల్యాణోత్సవాలు, చక్రస్నానం తదితర కైంకర్యాలు చేపడుతారని వివరించారు. భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్, పుష్ప అలంకరణలు చేపట్టాలని సూచించామన్నారు.

మహాకుంభ మేళకు సంబంధించి ప్రధాన రోజులలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండడంతో ముందస్తుగా కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. ఎస్వీబీసీ ద్వారా ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జేఈవో ఎం. గౌతమి, సివిఎస్వో శ్రీధర్, మునిసిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, టిటిడి సీఈ సత్యనారాయణ ,అధికారులు పాల్గొన్నారు.

# బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్..

లక్నో, జనవరి 4: మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవర్ ఒక బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో బైకర్ కారు బానెట్, బంపర్ మధ్య చిక్కుకున్నాడు. అయితే కారు నిలుపని డ్రైవర్ అతడ్ని కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. చివరకు మెడికల్ షాపు ముందున్న బైక్‌తోపాటు పేవ్‌మెంట్‌ను ఢీకొట్టాడు. ఇది చూసి స్థానికులు షాక్ అయ్యారు. మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్‌ను చితకబాదారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సాయంత్రం రద్దీ రోడ్డులో ఒక కారు వేగంగా దూసుకొచ్చింది. ఒక బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తి కారు బానెట్‌పై పడ్డాడు. అయినప్పటికీ కారును డ్రైవర్ ఆపలేదు. బానెట్, బంపర్ మధ్య చిక్కుకున్న బైకర్‌ను కొంతదూరం ఈడ్చుకెళ్లాడు. చివరకు ఒక మెడికల్ షాపు ముందున్న బైక్‌తోపాటు పేవ్‌మెంట్‌ను ఢీకొట్టడంతో ఆ కారు ఆగింది.

